**ప్రజల మాట ప్రగతి బాట**

# మేడ్చల్ నియోజకవర్గం

### కాంగ్రెస్‌కు ఎన్నికల్లో గుణపాఠం తప్పదు..



కీసరలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత డాక్టర్ భద్రారెడ్డి

**కీసర, నవంబర్ 22:** కాంగ్రెస్ పార్టీలో గుండాగిరి పెరిగిపోయిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి తనయుడు డాక్టర్ భద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం కీసరలో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఆయన ఖండించారు.మండల బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో డాక్టర్ భద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల తీరును ఖండిస్తూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల క్యాంపెనింగ్ కార్యక్రమాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నేతల తీరుపై విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నేతలపైదాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండే మంత్రి మల్లారెడ్డి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి వెంకటేశ్, ఎంపీటీసీ నారాయణశర్మ, మండల పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు వెంకటేశ్ ముదిరాజ్, రవికాంత్, శ్రావన్‌కుమార్‌గుప్త, బాల్‌రాజ్,పరమేశ్‌యాదవ్, సతీష్, భానుశర్మ, సాయియాదవ్, బోడుసు రమేశ్‌యాదవ్, ఎం. డీ. ఆరీఫ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధికే పట్టంకట్టాలి



శామీర్‌పేటలో మైనార్టీలకు బీఆర్ఎస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేందర్‌రెడ్డి.

**శామీర్‌పేట, నవంబర్ 22:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధికి పట్టంకట్టాలని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శామీర్‌పేట గ్రామానికి చెందిన మైనార్టీలు మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫారూక్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మహేందర్ రెడ్డి కండువాకప్పి ఆహ్వానించారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ ఉమర్, ఎండీ ఇర్ఫాన్, నాయకులు ఇలియాస్, సోని, చాంద్‌పాషా, అహ్మద్‌పాషా, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 80 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

**మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 22:** జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ 80 శాతం పూర్తి చేశామని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం ఢిల్లీ నుంచి రాష్ట్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ నిబంధనల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రణాళికతో పకడ్బందీగా ఎన్నికల నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొత్తం 1070 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామని, వారి ఇండ్ల వద్దకే వెళ్లి వారి ఓటును స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తి చేశామని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని వివరించారు.అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ,ఎన్నికల నోడల్ అధికారులు కృష్ణారెడ్డి, దేవసహాయం, విజయకుమారి, ఖాసీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, అధికారులు

# వ్యాక్సిన్లన్నీ..తుర్కపల్లినే..

- పారిశ్రామిక వాడకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు
- కేటీఆర్ కృషితో సాధ్యం
- మంత్రి చామకూర మల్లారెడ్డి



తుర్కపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్/ శామీర్‌పేట, నవంబరు 22 :** వ్యాక్సిన్లకు కేరాఫ్ అడ్రస్‌గా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి మారిందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తుర్కపల్లిలో ఆయన బుధవారం పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తుర్కపల్లి జీనోమ్ వ్యాలీలో అప్పుడే పుట్టిన పసికందుకు అవసరమైన టీకా నుంచి ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా టీకా వరకు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కరోనా టీకా తయారీతో తుర్కపల్లి పారిశ్రామికవాడకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందన తెలిపారు. మంత్రి కేటీఆర్ కృషితో జీనోమ్ వ్యాలీకి అంతర్జాతీయ స్థాయి సంస్థ లు తరలివచ్చి, పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. వందల నుంచి వేల కోట్ల రూపాయలతో పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ఐటీతో పాటు లైఫ్ సైన్సెస్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. హైటెక్ సిటీలో ఎన్నిక ఐటీ కంపెనీలు ఉన్నాయో తుర్కపల్లిలో అన్ని ఫార్మా కంపెనీలు ఉన్నాయని తెలిపారు. తుర్కపల్లి పారిశ్రామిక వాడల్లోని కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు వేస్తే ఐదేండ్లు పాటు సేవ చేస్తానన్నారు. అభివృద్ధి కోరుకుంటే కారు గుర్తుకు ఓటేయాలని, వినాశాన్ని కోరుకుంటే కంటే కాంగ్రెస్ ఓటేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మురహరిపల్లిలో లక్ష్మాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దండు రాజేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ వార్డు సభ్యుడు వీరాల్, శంకర్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

### కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



పీర్జాదిగూడ 16వ డివిజన్‌లో నిర్వించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మేయర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ చామకూర ప్రీతిరెడ్డి, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్

**పీర్జాదిగూడ:** మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడి, రాష్ట్ర మహిళా నాయకురాలు, డాక్టర్ ప్రీతిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పీర్జాదిగూడలో 16వ డివిజన్‌లో కార్పొరేటర్ రమ్య సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం మేయర్ వెంకట్‌రెడ్డి, చామకూర ప్రీతిరెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీనీ గెలిపించాలని కోరారు. మంత్రి మల్లారెడ్డి ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు రమ్య సతీష్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



బోడుప్పల్ 13వ డివిజన్ దేవేందర్‌నగర్ కాలనీలో పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

## ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలి



అనురాగ్ యూనివర్సిటీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 2:** రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయకుమార్ తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో 62వ జాతీయ ఫార్మసీ వీక్-2023 సందర్భంగా ఆరాధ్య బ్లడ్ బ్యాంక్, లయన్స్ క్లబ్ జూబ్లీహిల్స్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్-1 ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 354 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ సి మల్లేష్, డీన్ వసుధ భక్షి, బాబా శంకర్ రావు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో హోం ఓటింగ్

**వినియోగించుకున్న 14 మంది**

**మేడ్చల్, నవంబరు 22 :** మేడ్చల్ పట్టణంలో ఎన్నికల అధికారులు బుధవారం హోం ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సారి ఎన్నికల్లో తెలంగాణలో 80 ఏండ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించే అవకాశాన్ని కల్పించారు. అందులో భాగంగా మేడ్చల్ పట్టణంలో 14 మందికి ఎన్నికల అధికారులు ఈ అవకాశాన్ని కల్పించారు. వారు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.




ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

## అక్రమ మద్యం స్వాధీనం

**మేడ్చల్, నవంబరు 22:** అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు దాడి చేసి, పట్టుకున్నారు.అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉం చారన్న సమాచారంలో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో అధికారులుబుధవారం దాడి చేశారు. 122 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బండి మల్లేశ్ గౌడ్, బండి ప్రమీలపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్సైలు రాఘవ, యూసుఫ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నవనీత మాట్లాడుతూ అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి, అనుమతుల్లేకుండా మద్యం పార్టీలు నిర్వహించొద్దని హెచ్చరించినట్టు తెలిపారు. క్లబ్‌హౌజ్‌ల పైన నిఘా ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.